# పంచపాత్ర

శ్రీ కె. ఎస్. వి. నరసింహం

(గత పంచిక తరువాయి)

## 2

అవును, కళాకీ, నాకూమధ్య పేచీ ఎందుకొచ్చిందో ఎలావచ్చిందో కళాకీ తెలీదు, నాకూ తెలీదు. వాడు పట్టుదలమనిషి, నేనూ పట్టుదల మనిషిని. కారణాలంటే—ఇవే కారణాలు కావొచ్చు—తలుచుకున్న పని చేసి తీరతాడు వాడు. నేనొద్దన్నపని ఎవరు చేసినా సహించలేను నేను. పెద్ద పేచీ ఇది. ముదిరేదాకా ఇది పెద్ద పేచీ అని మా ఇద్దరికీ తెలీదు.

ఆగర్భ శత్రువుల్లాగా నేనూ, అఖిలా మెలగడం కళా సహించలేక పోయేవాడు. తను ప్రేమించే ఇద్దరూ పరస్పరం ద్వేషించుకోవడంలోగల విధివైచిత్రి ఎంత ప్రయత్నించినా వాడికి అర్థంకాలేదు. ఇంట్లో మా ఇద్దరిమధ్యా వాడు స్వేచ్ఛగా తిరగలేక పోయేవాడనేది మాత్రం నిజం. అది నేనిప్పుడే తెలుసుకున్న నిజం. అప్పుడు తెలీదు నాకు.

అందుచేత, సాధ్యమైనంత సమయం ఇల్లొదిలి బైట తిరుగుతూనే గడిపేవాడు కళా. స్నేహితులున్నారు. వాళ్ళతో పరిచయం మరీ ఎక్కువైంది. వాళ్ళతోటిదే లోకమైపోయింది.

కళా అలా ప్రవర్తించడం నాకిష్టం లేకపోయింది, కాని ఆ సంగతి వాడి ముఖాన్నే చెప్పలేకపోయేను. కళా ప్రవర్తనకి కారణం నాకు తెలుసు, కారణం—నేనే! నేనూ—అఖిలా మాత్రమే కారణం! కాని, ఆ చేదు నిజాన్ని ఒప్పుకునే ఆత్మస్థైర్యం నా కెక్కడిది? కారణం నేనేననీ ఒప్పుకోలేను. కళా—అయినవాళ్ళతో, కానివాళ్ళతో కూడా కలిసి మెలిసి అదే జీవితంగా వాళ్ళతోటే కాలం గడుపుతూండడం కూడా సహించలేను!

ఏం చెయ్యను?

ఏమీ చెయ్యలేను!

కళాకోసం వాడి స్నేహితులు అప్పుడప్పుడూ బంగళాకి వస్తూండేవాళ్ళు. వాళ్ళని చూస్తే నాకు తగని వొళ్ళుమంటగా వుండేది. వొక్కొక్కర్నీ జుట్టుపట్టిలాగి హింసించి చంపాలనిపించేది. పూః హు—వీలుపడదు. అందుచేత—ఏం చేసేవాణ్ణి? కళా ఇంట్లో వుండగానే—ఇంట్లో లేడని వాళ్ళని నమ్మించేసేవాణ్ణి. సోఫాల్లో వాళ్ళు కూచునివుంటే చిరాగ్గా చూసేవాణ్ణి. కళాకి ఇన్‌లెండ్ లెటర్సొగాని వొస్తే—చించకుండానే—మడతసందులోంచి చదవగలిగేంతా చదివేవాణ్ణి. ఇదంతా నేనెందుకు చేసేవాణ్ణో నాకే పూర్తిగా అయేదికాదు. కాని, అలా ప్రవర్తించకూడదని ఎంతగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు. నా ప్రతి చేష్ట కళా గమనిస్తూంటాడని తెలిసి కూడా నేనతని స్నేహితుల్ని ఏదోరకంగా అవమానిస్తూండేవాణ్ణి. వొకసారి వొకతమాషా జరిగింది. అప్పుడది తమాషాయేగాని, తలఃచుకుంటే ఇప్పుడు నాకు లజ్జ అనిపిస్తుంది.

కళాకి బైట వూళ్ళలో కూడా స్నేహితులున్నారు. ఉత్తరాల స్నేహితులు. హైదరాబాదునుంచి కాబోలు ఐదుమందొచ్చేరొకసారి కళాకోసం. ఐదుమందీ బంగళాలోనే దిగేరు. అది నా కిష్టంలేదు. ఆ సంగతి కళాకి తెలుసు. నేను చెప్పలేను. గ్రహించినప్పటికీ కళా మాత్రం ఏం చెయ్యగలడు? అంత పెద్ద ఫ్యాక్టరీ యజమాని కొడుకు, రాకరాక వొచ్చిన స్నేహితుల్ని ఏ లాడ్జిలోనో ఎలా దింపుతాడు? అదీ, అంత విశాలమైన బంగళా వుండగా!?

సరే, ఆ అయిదుమందీ బంగళాలో మూడు రోజులున్నారు. ముఖాముఖీగా వాళ్ళనెప్పుడూ కలుసుకోలేదు నేను. టీనేజర్స్ అంటే నాకు సానుభూతి లేదు. కళాకి అంతమంది స్నేహితులుండడం, వాళ్ళొచ్చి నా ఇంట్లో బసచెయ్యడం—ఏమాత్రమూ నచ్చలేదు నాకు. చెప్పలేదూ—కారణాలు తెలియని అనేక విషయాల్లో ఇదీ వొకటి!

మూడు రోజులు ఆ అయిదుమందీ బంగళాలోవున్నా, వాళ్ళెప్పుడూ నా కంటబడలేదు. వాళ్ళని నాకు పరిచయం చెయ్యలేదు కళా; పరిచయం చెయ్యలేడు! ఎందుకంటే—అది నాకు గిట్టదు!

మూడోరోజు రాత్రి నాకెందుకో అసీజీగా వుంది. కళాకోసం అయిదుగురు స్నేహితులొచ్చి నా ఇంట్లో వుంటూండగా—నేను వాళ్ళలో ఏ వొక్కర్నీ ఏ వొక్కసారీ కూడా—అవమానం చెయ్యలేదే!!

అదేం బుద్ధో నాకు తెలీదు.

నా ఆలోచనకి నాకిప్పుడు చెప్పలేనంత అసహ్యం వేస్తుంటుంది.

ఆ రాత్రి పదకొండు తర్వాత ఇంకా కళా గదిలో లైటు వెలుగుతోంది. అయిదుమంది స్నేహితులతో నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నాడు కళా. ఆ నవ్వులు నాగదికి వినిపిస్తున్నాయి.

అయిదుగురూ మరుసటిదినం హైదరాబాదు వెళ్ళిపోతారని నాకు నౌకర్నవల్ల తెలిసింది.

అందుకే – అంత సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

నాకు నిద్రపట్టలేదు.

వెళ్ళేలోపలే వాళ్ళందర్నీ ఒక్కసారైనా అవమానించాలి.

ఎలా ? ఎలా ?

నీకు తెలీదు, అదేం కాంప్లెక్సంటారో – ఎవరైనా సైకాలజిస్ట్‌ని అడిగి తెలుసుకోవాలి.

అసహ్యమైనా సరే-అందులో ఏదో ఒక ఆనందం వుండే వుంటుంది.

గదిలోంచి వెలుపలి కొచ్చేను. కళాగదిలో లైటు వెలుగుతోంది. ఫ్యాన్ గిర్రున తిరుగుతోంది. కిటికీ అద్దంమీద నీడ కదులుతోంది. గదిలో స్నేహితులతో కళా నవ్వుకుంటున్నాడు. ఏం చెయ్యాలి ? ఏమీ తోచలేదు. నెమ్మదిగా మేడ దిగొచ్చేను. వరండాలో పచార్లు చేసేను. పైనుంచి నవ్వులు వినిపిస్తున్నాయి. ఏంచెయ్యాలి ? మెట్ల ప్రక్కగావున్న మెయిన్‌స్విచ్ కనిపించింది!!... ఆ ఆలోచన అప్పుడెలా వొచ్చిందో తెలీదు – చప్పున వెళ్ళి మెయిన్ స్విచ్ ఆఫ్ చేసేసేను. మరుసటి క్షణంలో పైనుంచి కేకలు వినిపించేయి–

"గోవిందా–లైట్ ఆరిపోయింది !"

"కరెంటు పోయింది–"

"అయ్యో ! లైటుంటే బాగుణ్ణు !..."

నాకే తెలీని విజయగర్వంతో పొంగిపోయేవ్వేను.

ప్రపంచాన్నంతటినీ జయించినా కలగని ఆనందం కలిగింది.

"ఎవరది ?–" అన్నాడు నైట్‌వాచ్‌మన్. మెయిన్ స్విచ్ ఆఫ్ చేసేమనటూ ? మామూలుగా వరండాలో రాత్రిళ్ళు లైటు వెలిగేది. అదీ ఆరిపోయింది.

"నేనేలేరా !..." అన్నాను.

గమ్మున నాగది కొచ్చేసేను.

నేను మెయిన్‌స్విచ్ దగ్గర తారట్లాడడం వాచ్‌మన్ చూసేడా ? నేనే ఆఫ్ చేసేనని పసిగట్టేడా ?

ఏమో ! కాని–

మరుసటిదినం స్నేహితులందర్నీ పమ్మించేసి ఇంటికొచ్చిన కళా–హాల్లోవున్న నాకేసిచూసిన చూపులో ఎంతో జుగుప్స కనిపించింది.

తెలిసిపోయింది !

క్రితంరాత్రి నేనుచేసిన లజ్జమాలినపని కళాకి తెలిసిపోయింది!

ఆసంగతినాకు ఖచ్చితంగా తెలిసిపోయింది.

ఎంత సిగ్గుచేటు !

కోటి రూపాయల ఆస్తి అయినా వుండొచ్చునాకు. కాని, నేను చేసిందెంత హేయమైనపని ! ఎవరూ నమ్మరు, నమ్మలేరు. నేను–ఆపని చేసేనంటే! ఎందుకు చేసేను? తెలీదు. ఎవరికీ తెలీదు.

అసలు నాకే తెలీదు.

చెప్పేనుగా – పెద్దమనిషిలో చిన్నబుద్ధి !

కళా స్నేహితులమీద నాలో అజ్ఞాతంగావున్న కసి !

ఏ సైకాలజిస్ట్‌నో అడగాలి ... ...

"సారీరా బాబూ !" అని కళాతో చెబుదామనిపించింది చెప్పలేదు. అభిమానం అడ్డొచ్చింది.

"ఎందుకు చేసేవు డేడీ అలాగ ?–" అని కళా అడగరాదూ? వూహూఁ – అడగలేదు, అడగడు. వాడు కళా ! నాకొడుకు, నా అభిమానం నాది, వందమంది ధనపతుల అభిమానం వాడిది.

లోకంలో ఇలాంటి వాళ్ళుంటారా ?

ఇంత పంతాలకి పోతే చివరికేమౌతుంది ?

ఏమౌతుంది, చెప్పూ – మన్య రచయితని ... ...

"ఇంతకూ ఏమైంది ? మీరు చెప్పండి !..." అన్నాను.

"ఏమయ్యుంటుందో నువ్వూహించలేవూ ?" – అన్నాడు ధనపతి – ఇహ చెప్పాల్సింది ఆట్టే లేదన్నట్టుగా.

"గలను–కాని–ఊహకన్నా వాస్తవం వినడమే బాగుంటుంది నాకు –"

"ఊహ రసవంతం. వాస్తవం నీరసవంతం. ఆ సంగతి మొదటే చెప్పేస్నీకు. బోరు కొడుతోంది కదూ ? ..."

"బోరు నాకు కొత్తకాదు. అదీ ఒక విద్యే. అందరూ అందంగా బోరుకొట్టించలేరు –"

"హూఁహూఁ–ఇలాగైతే నువ్వు పైకిరాలేవు–" అని చప్పరించేడు ధనపతి.

"ముందు మీ కథ బైటికి రానివ్వండి–" అన్నాను. అందు మీదట ధనపతి ఇలా కొనసాగించేడు–

...అంతే. ఆదినం నుంచి కళా మారిపోయేడు. కొత్త కొత్త అలవాట్లు నేర్చుకున్నాడు.

"సినబాబుగారేటండీ – సిగిరెట్లట్టా వూది పారేస్తారు–" అన్నాడొకరోజు – నా అంతరంగిక నౌకరు, నమ్మకస్థుడు.

నివ్వెర పోయేను.

సిగిరెట్లెందుకు తాగడం మొదలెట్టేడు కళా?

నివ్వెరపోవాల్సినవి ఇంకా చాలా జరిగేయి.

కళా తాగుడు మొదలెట్టేడు.

జూదం నేర్చుకున్నాడు.

వీటిలో ఏవీ కళాకి మొదట ఇష్టంలేదు. ఆ సంగతి నాకు తెలుసు. బాగా తెలుసు. నేర్చుకున్నాడు కళా, కావాలనే నేర్చుకున్నాడు.

మందలించాలి. ఎలా మందలించను? ముఖం చెల్లలేదు.

అఖిలతో ఈ విషయాలన్నీ చెప్పాలనుకున్నాను.

చెప్పలేదు.

ఏమని చెప్పను? ఎలా చెప్పను?

కళా కొత్త అలవాట్లు ఆమెకీ తెలిసేయి. ఆమె ఐక్యం కలిగించుకోలేదు. కలిగించుకోదని తెలుసు.

ప్రేమగా మారలేని ద్వేషం ద్వేషంగానే మిగిలింది.

కళా పాడైపోతున్నాడు. ఆ సంగతి నన్ను బాధిస్తోంది.

ఎవరో కొందరు స్త్రీల పేర్లతో కళాపేరు కలిసి నాకు వినిపించడం ప్రారంభమయేసరికి నాకు పూర్తిగా మతిపోయినంత పనయింది.

సాధ్యమైనంత తొందరలో కళాకి పెళ్ళి చేసెయ్యాలని ఆ ప్రయత్నాలు మొదలెట్టేను. మా బంధువర్గంలోంచి సమ్మంధాలు కూడా విరివిగా రాసాగినై. అంతలో–

యుద్ధం డిక్లేర్ చేసేడు కళా నామీద. పరోక్షయుద్ధం కాదు. ప్రత్యక్ష యుద్ధమే!

ఫ్యాక్టరీ కార్మికులు సమ్మె చేసేరు.

జీతాలు చాలవు. పెంచాలి. యూనిఫామ్స్ మంచివి సప్లయి చెయ్యాలి. షిఫ్టు సిస్టమ్‌లో సంస్కరణలు కావాలి. బోనస్‌లు పెంచాలి. హాస్పిటల్ సౌకర్యాల్లేవు. సౌకర్యాలన్నీ కలిగించేంతవరకూ పనిలోకి రాం. వేరే కార్మికు లెవ్వర్నీ రానివ్వం.

"ధనపతి–డౌన్ డౌన్–"

"కాపిటలిజం–నశించాలి!–"

నినాదాలు, ఊరేగింపులు, సభలు,

తల తిరిగిపోయింది నాకు.

వొక్కసారిగా ఈ గొర్రెమంద కార్మికులకి ఇంత ధైర్యం ఎలా వొచ్చింది?

తెలిసిపోయింది.

కళా చేసేడు! అంతా కళా చేసేడు!! తండ్రిమీద కత్తి గట్టేడు కళా!

జిల్లా కలెక్టర్ తణిఖీ, లేబర్ మినిస్ట్రీనుంచి నోటీసులు.

ఏం చెయ్యాలి?

దిక్కు తోచలేదు.

కార్మికులందరికీ వొక నాయకుడున్నాడు. కళా మాటలతో పొంగి ఆవేశం తెచ్చుకున్నది వాడే! సమ్మె జరిపిస్తున్నదీ వాడే!

కళా నామీద కత్తిగట్టేడన్నాను కదూ?

ఆ కత్తి–ఆనాయకుడే!

నాకూ సలహాదారులున్నారు, మందీ మార్బలంవుంది. చేసూరుకున్నా నా సిబ్బంది వూరుకోదు.

సమ్మె ఉధృతంగా జరుగుతూన్న పక్షం దినాల్లో వొక మధ్యాహ్నం-ఫ్యాక్టరీకీ, వర్కర్స్ కాలనీకి మధ్య [illegible] లారీ ఆక్సిడెంట్ జరిగింది.

సమ్మె జరిపిస్తూన్నకార్మికనాయకుడు ఆ అక్సిడెంట్‌లో మరణించేడు!

జనం దాని గురించిన నిజాలూ, అబద్ధాలూ కథలు కథలుగా చెప్పుకున్నారు. సరే–పోలీసులొచ్చేరు. ఎంక్వయిరీలు జరిపేరు. సాక్ష్యాలుకూడా సేకరించేరు–పోస్ట్ మార్టం రిపోర్ట్ కూడా వచ్చింది.

పూటుగా తాగేసి నట్టనడిరోడ్డుమీద నడుస్తూ వొచ్చిన కార్మిక నాయకుడు–తూలి లారీకిందపడి చనిపోయేడు!

దుర్మరణం పాలైన కార్మిక నాయకుడి కుటుంబానికి నేను ఒక సహాయ నిధిని ప్రారంభిస్తూ నా చందాగా పదివేల రూపాయల చెక్కు దఖలు పరిచేను.

ఆ విషయం గురించి నన్ను పొగుడుతూ పేపర్లన్నీ రెండేసి నిలువు కాలమ్స్ ఖర్చు పెట్టేయి!

ఆ తరువాత!

ఆ తరువాత ఏం జరిగిందనుకున్నావు?–

కళా కొన్ని దినాలపాటు మౌనంగా వుండిపోయేడు. రాత్రయితే దిలో లైటయినా వేసుకోకుండా ఆలోచనల్లోనే గడిపేవాడు నిద్రాహారాలు మానేశాడు. ఒకరోజు రాత్రి కళా బంగళానుంచి మాయమైపోయేడు.

నౌకరొచ్చి చినబాబు కనిపించడం లేదని చెప్తే కళా గదికి వెళ్ళేను. సిగరెట్టు పీకలు! బ్రాందీసీసాలు! – అతి జుగుప్సాకరంగా వుంది గది!

టేబిల్ మీద ఒక కవరుంది.

కవర్లో చిన్న కాగితం–

"డేడీ!–

నిన్ను నేను ప్రేమించేను. నా స్నేహితుల్ని నువ్వు టీజ్ చెయ్యడం చూసి నువ్వొట్టి అల్పబుద్ధి వనుకున్నాను. నీలో నీచత్వం వుందని నాకిప్పుడు తెలిసింది. ఇక భరించలేను. నాకోసం వెదక్కండి. వెదికేరా? దొరికేది నా మృతకళేబరమే!

–కళా"

అని అందులో రాసుంది

అంతే!

అంతే...నా కళాని నేను మళ్ళీ దిప్పుడూ చూడలేదు, ఇహ చూడలేను. వాడిహ ఇంటికి రాడు. నాకు తెలుసు. వాడురాడు. అంతే ... ...

– కథ చెబుతూ చెబుతూ రుద్ధకంఠంతో ఆగిపోయేడు ధనపతి.

"అయితే ఇప్పుడు కళా ఎక్కడున్నట్టు ?–"

"తెలియదు"–

"తెలుసుకునేందుకు మీరు ప్రయత్నంకూడా–"

"చెయ్యలేదు, చెయ్యలేను. ఎలా ప్రయత్నించను ? కళా తత్వం నాకు బాగా తెలుసు. తెలిసీ నేను వాణ్ణి వుసిగొల్పేను. వెదకొద్దన్నాడు. ఇక వెదక్కూడదు. అంతే!... కాని, ఒక్కసంగతి చెప్పు ఆనందరావ్ !... తప్పెవరిది ? కళాదా? నాదా ? – లేక అంతా విధికృతం అనుకోవాలా ? వంశ పారంపర్య లక్షణాలని సమర్థించుకోవాలా ? నాలోవున్న మొండితనమే కళాలోకూడా వుండి ఈ విపరీత పరిణామానికి దారితీసిందా ?–చెప్పు – నీకేది సబబనిపించినా చెప్పు – నేనేమీ అనుకోను–" అన్నాడు ధనపతి.

–పై ప్రశ్నలకి సమాధానాలు తెలిసికూడా చెప్పకపోయేవో... నీతల వేయి ముక్కలైపోతుంది–అని ధనపతి అనలేదు.

భేతాళుడి ప్రశ్నలకి పాపం విక్రమార్కుడు కాబట్టి సమాధానాలు చెప్పేడు. నిజానికి సమాధానాలేమిటో భేతాళుడికే తెలియవేమో!

నా భేతాళుడు ధనపతి.

"చెప్పు–నేనేం అనుకోను–" అంటున్నాడు.

శవంతో సహా చెక్కడు. ఏమీ అనుకోకుండా వుంటాడంతే! కాని నాకు మౌనభంగం కావడంలేదే!

"సబబు కేముందిలెండి–" అన్నాను చివరికి. అని, నవ్వేను– "ఏది ఏమైనా ప్రస్తుతానికి మీకథ రాయలేనేమో! అసలు–మొదట మీరు కథేమీ చెప్పనన్నారు. తరువాత మీగురించి మాత్రం చెప్తానన్నారు. తీరాచేసి మీరు చెప్పింది – మీ కొడుకు గురించి–"

"మర్చిపో–మర్చిపో–" అన్నాడు ధనపతి.

ఏమిటి మర్చిపోవడ మన్నాను.

"కళాగురించి నేను చెప్పిందంతా మర్చిపో–" అన్నాడు ధనపతి. క్షణంసేపు ఏదో ఆలోచించేడు – "సరే – ఒకపని చేస్తావా ?–"

ఏమిటన్నాను.

"కళాగురించి నేను చెప్పిందంతా మర్చిపో!–మరేం ప్రమాదం లేదు. కాని నాగురించి ఒక నవలరాయి. ఫరవాలేదు రాసిపారెయ్యి. అంతా ఫస్ట్ పర్సన్ సింగ్యులర్‌లోరాయి. చివర – కొడుకు ఇల్లు వదిలిపోయేసరికి తండ్రి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధపడతాడు. ఆ తండ్రి సరిగ్గా నాలాంటి తండ్రే! ఆఁ–అన్నట్టు–నవలపేరు– "నాలాంటి తండ్రి–" అని పెట్టు–ఏం ? బాగుంటుందా ?– సరే– మార్చెయ్యి. వేరే ఏదైనాపెట్టు. ఏం ? కళాకు సంబంధించిన నా ప్రవర్తన వివరాలన్నీ గుర్తున్నాయికదూ ? ఆ వివరాలకు ఇంకొంచెం కలరింగ్ ఇవ్వు – ఫరవాలేదు. కాని, ఒరిజినల్ థీమ్‌మాత్రం మారిపోకూడదు. రచనమాత్రం అంతా పకడ్బందీగా వుండాలి!...'

ఆయన చెప్పేది నాకాట్టే రుచించలేదు. మాటవరసకి–మీరు చెప్పినట్టు నవల రాస్తానే అనుకోండి–రాస్తే–ఏమవుతుంది?–"

"రాసి–పబ్లిష్ చేయించు–ఏదైనా పత్రికలో సీరియల్‌గా–"

నవ్వాగలేదునాకు. "సరే–పత్రికలవాళ్ళు వేసుకోకపోతే ?"

"ఎందుకు వేసుకోరు ? – ఏం ? – నాకథ అంత చప్పగా వుందా ? నువ్వు కొంచెం బాగానే రాస్తావని అంటారే!..."

"మీ కథ బాగుండడమూకాదు,దాన్ని నేను బాగా రాయడమూ కాదు. అది పత్రికలవాళ్ళకి నచ్చడమంట్టూ వొకటుందిగా! –"

క్షణం ఆలోచించేడు ధనపతి. "సరే – ఆ సంగతి నాకొదిలి పెట్టు – నవలరాయి నువ్వు – దాన్ని పబ్లిష్ చేయించే పూచీ నాది ..."

ఆయన మనసులో ఏముందో తెలీదు.

ఆయన చెప్పడు. నేనడగను.

గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. (నాగదిలో గడియారంవుంది.)

ధనపతి వాచీ చూసుకున్నాడు.

"మరి నే వెళ్తాను–" అన్నాడు.

ఎక్కడికని నేను అడగలేదు.

ఎక్కణ్నుంచి వచ్చాడో మాత్రం నాకు తెలుసుగనకనా?

"ఎప్పుడు పూర్తిచేస్తావు నవల ?–" అన్నాడు ధనపతి.

"ఆలోచిస్తాను–"

"ఈ వృద్ధుడి ప్రాణాలతో ఆడుకోకు –" అన్నాడు సీరియస్‌గాను.

"అదేమిటి?–" అన్నాను నివ్వెరపోతూ. "నిజం చెప్పండి–మీమీద నవల పబ్లిష్ అయినా–మీకేం లాభం?–"

"లాభనష్టాలు బేరీజు వెయ్యడానికి జీవితం వ్యాపారంకాదు–అయినా–ఏమో–నవలని కళా చదివితే–నేనే అది రాయించేనని గ్రహించి–మనసు మార్చుకుని నాకోసం మళ్ళీ వొస్తాదేమో!... ఏమో !...వస్తాదేమోనని..."

వాణికే గొంతులో ఆశ......

"ప్రయత్నింతు–ఆనందరావ్! ఇంతకన్నా నీకు నేనేమీ చెప్ప లేను నవల రాయి–కళాకోసం నేను వెదకలేను, వెదక్కూడదు వెదికితే వాడు నాకు దక్కడు. ఇహ మిగిలింది ఒక్కటే న– నవలరాయి–చాలు–ఏమో నా కళా మళ్ళీ వొస్తే–" కళ్ళు తిరిగి పెట్టాయి ధనపతి కొంచెం తూలేడు.

పట్టుకోబోయేను.

వారించేడు.

"ఫరవాలేదు. నేనిప్పుడే రాలిపోను–నా కళా రావాలి నా కళాని చూడాలి...మళ్ళీ వస్తాన్లే ఆనందరావ్.." మతి భ్రమించిన వాడిలాగా శూన్యమైన కళ్ళతో చూసేడు. "మళ్ళీ వస్తావటావా?–ఏమో! ఇహ నేనాట్టే దినాలు బ్రతకనేమో! నా కళారానేరాదేమో! కళాని చూడకుండానే......" వెర్రిగా నవ్వేడు..."అంతేలే... అంతేలే...ఎవరికెంత ప్రాప్తమో అంతే......"

"మీరు వొర్రీ కాకూడదు–" అన్నాను, ఏదోవొకటనాలని–

నిశ్చలంగా చూసేడు ధనపతి. ఏదో చెపబోయేడు, చెప్పబోయింది చెప్పడం మానుకున్నాడు. నిట్టూర్చేడు.

"సరే నే వెళ్తాను. నవల రాయవూ?–"

అంతే! వెళ్ళిపోయేడు ధనపతి.

చీడీలు దిగుతున్న చప్పుడు, కారొకటి స్టార్టయి వెళ్ళిపోయిన చప్పుడు.

"సరే–నే వెళ్తాను. నవల రాయవూ?"

ధనపతి గొంతు గదిలో మంద్రస్థాయిలో ప్రతిధ్వనిస్తోంది! చీకటి గుహలోంచి విషాద మృదంగాలు మ్రోగినట్టుగా నుంది!!

యాంత్రికంగా సిగరెట్టు అందుకుని వెలిగించేను......

ధనపతి గురించే ఆలోచిస్తూ వున్నాను.

అలా ఎంతసేపు గడిచిందో తెలియదు.

"ఆనందరావుగారూ!–"

తల తిప్పి చూసేను.

గుమ్మంలో వొక యువతి.

"ఎవరూ?"

"లోపలికి రావొచ్చా?–"

"–వొచ్చి అడుగుతున్నారు–"

నవ్వింది. కాళ్ళకేసి చూసుకుంది. మళ్ళీ తలుపువాటుకి

వెళ్ళింది. వెలుపల్నుంచి గదిలోకి తొంగిచూస్తున్నట్టు అభినయించింది. 'లోపలికి రావొచ్చాసార్?—"

నవ్వకుండా వుండలేకపోయేను—"రండి—"

లోపలికొచ్చిందామె. కూచొమ్మన్నాను, కూచుంది. కాఫీ-టీ-కూల్ డ్రింక్!?—"

"టీ తీసుకుంటాను-"

టీ తెప్పించేను. లేదా, టీ వొచ్చింది. (నా గదిలోకి నాకేవి కావాలంటే అవి వొస్తాయి—)

"చెప్పండి-" అన్నాను.

"నా పేరు కైక—" అని ఆగింది.

"విచిత్రమే" అన్నాను. రామాయణంలోంచి కైక, ఊర్మిళ, మంథర, మండోదరి-ఈ పేర్లు ఎవరూ పెట్టుకోరు-ఎందుకనో—"

"పేరు విచిత్రమేగాని—నేను మామూలు మనిషినే!..."

"నా పాత్రలు మామూలు మనుషులు కావడమే వొక విచిత్రం......"

"అరె—నేను మీ పాత్రనని ఎలా కనిపెట్టేసేరు?..."

అమాయకుల్లా వున్నారు. పాత్రల్ని రచయితలూ, రచయితల్ని పాత్రలూ ఆ మాత్రం గుర్తించలేకపోతే ఎలా?—సరే—చెప్పండి.మీమీద కూడా నవల రాయాలా?"

"నామీద కూడా—అంటే?—" |

"అది వేరేకథ—చెప్పండి—మీ సంగతేమిటి?—"

"రాస్తే రాయండి లేకపోతే మానెయ్యండి—అందుగురించి నాకు పెద్ద ఆందోళన ఏమీలేదు. ఎందుకో మిమ్మల్ని చూద్దామనిపించింది. మంచి పాత్రలు దొరక్క మీరేమైనా ఇబ్బందిలో వున్నారేమోననిపించింది...సరే—నావల్ల మీకేమైనా మేలు జరుగుతుందేమోనని—"

"వోకే, వోకె. ప్రొసీడ్!......"

"ఇంకా వేరే పాత్రలకేమైనా అప్పాయింట్‌మెంట్లిచ్చారేమిటి? తొందరపెడుతున్నారు!..."

"నే నివ్వడమేమిటి? పాత్రలే రచయితకి అప్పాయింట్‌మెంట్లివ్వ కూడదూ? మరీ తొందరేం లేదు-మీ గురించి మీరు ఏమేం చెప్పగలరో నిదానంగా వివరంగా చెప్పండి—" అన్నాను.

కిలకిలమని నవ్వింది కైక

ఊహూఁ—ఆవిడకా పేరు సరిపోయిందని వింత ప్రయత్నించినా సరిపెట్టుకోలేక పోతున్నాను.

పల్చటి మనిషి. చక్కటి చాయ. చలాకీ చక్రాల కళ్ళు. నవ్వు కోసం సిద్ధంగావుండే పసితనం వొదలని పెదవులు. "ఈ జీవితంలో సరదా చాలా వుంది—" అంటున్నట్టు వుల్లాసంగా కదిలే ముంగురులు. ఇరవయ్యొక్క సంవత్సరాల కైక—ఈ కైకకీ—రామాయణంలో. రాముణ్ణి అడవులపాలు చేసిన కైకకీ— పోలిక-లెక్కడైనా వున్నయ్యా?

నవ్వడం ఆపింది కైక.

"నిదానంగా వివరంగా చెప్పను. తొందరగా క్లుప్తంగా చెప్తాను. ఏం-వినలేరా?"—అంది కైక.

కాలికేస్తే మెడకూ, మెడకేస్తే కాలికీ వేస్తుందిరా ఈవిడ అనుకుంటున్నాను.

"ఏం సార్! మొదలెట్టమంటారా?" అంది కైక.

"అభ్యంతరమేమిటి?—కానివ్వండి-" అన్నాను.

"ఏదీ-మీరు సిగిరెట్టు అంటించండి మరి—"

"మీరు చెప్పడానికీ, నేను సిగిరెట్టు తాగడానికీ సంబంధం ఏమిటి?"

"మీరు వినే మూడ్‌లో వున్నారని అనిపిస్తూవుంటే-నేను నిరాటంకంగా చెప్పగలను-"

గడుసు పిండం. సరే. వెలిగించేను సిగిరెట్టు. 'ఇహ చెప్పండి-"

—అనగనగా ఒక నేను.

ఆ నేను పేరు కైక.

ఆ కైకకి గొప్పరూపం లేకపోయినా మంచి రూపం వుంది. పెద్ద హోదా లేకపోయినా తగుపాటి హోదా వుంది. కన్నతల్లి లేకపోయినా పెంచిన తండ్రి వున్నాడు. కాని ఆ కైకకి ఆశలు మాత్రం చాలా వున్నాయి. ఆశయాల గురించి ఆమెకు అట్టే తెలీదుగాని—బతుకులో బాగా సుఖపడాలని కమ్మటి కోరికలు చాలా వున్నాయి. కైకకి పెద్ద హోదాలేకపోయినా తగుపాటి హోదా వుందన్నాను కదూ? ఆ తగుపాటి హోదాని (లేదా—ఆ హోదాని ప్రసాదించే ఆస్తిపాస్తుల్ని) పంచుకునేందుకు ఆమెకింకా నలుగురు చెల్లెళ్ళున్నారు. భూమ్మీద ఎవరి బ్రతుకులు వారివి. అలాగే ఎవరి కలలు కూడా వారివే! కైక కలల్లోకి ఆమె చెల్లెళ్ళు ఎప్పుడూ ప్రవేశించలేదు......

కైక కథనం బాగుంది.

(ఇంకావుంది)